పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



అనిట్స్‌లో మొక్కలు నాటుతున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు



మజ్జిపేట హైస్కూల్‌లో మొక్కలతో మ్యాజిక్ బస్ ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు



జీరుపేటలో మొక్క నాటుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మొక్క నాటుతున్న విద్యార్థులు

తగరపువలస: పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుతూ భీమిలి మండలం మజ్జిపేట హైస్కూల్ ఆవరణలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో మొక్కలు నాటారు. పాలిథిన్, ప్లాస్టిక్ వస్తువుల వినియోగం ప్రాణకోటికి ప్రమాదకరమన్నారు. జీవరాశి మనుగడకు గాలి, నీరు, భూమి అవసరమని వక్తలు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.ఎస్.వెంకటరెడ్డి, ఉపాధ్యాయురాలు జాస్మిన్, పీఈటీ కై లాస్‌రెడ్డి, డ్వాక్రా మహిళా సంఘం అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, మ్యాజిక్ బస్ ప్రతినిధులు దూడ రమేష్, గుడివాడ దుర్గ, శారద తదితరులు పాల్గొన్నారు. వీరు అనంతరం భీమిలి ప్రభుత్వ హైస్కూల్‌లో పర్యావరణ దినోత్సవంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శివరాణి తదితరులు పాల్గొన్నారు.

- సంగివలస అనిట్స్‌లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో వంద మొక్కలు నాటి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ జి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పర్యావరణ దినోత్సవాల్లో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు వెయ్యి మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.బాలకృష్ణారావు, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 2వ వార్డు జీరుపేటలో వైఎస్సార్‌సీపీ నాయకులు జీరు వెంకటరెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి, కొసన రామారావు మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఆనందపురం : పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలని విశ్వనాథ ఫార్మా స్యూటికల్స్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉమాదేవి సూచించారు. మండలంలోని మిందివానిపాలెంలో ఉన్న కళాశాలలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకూ కాలుష్యం పెరుగుతుండడంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తే కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, కాలుష్యం వల్ల కలిగే అనారోగ్యంపై వివరించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి టి.సమన్వయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

పద్మనాభం: మొక్కలు నాటడంతోనే పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవి కుమార్ సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బర్లపేటలోని స్మృతివనంలో గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు, మండల బీజేపీ నాయకులు సోమవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ ప్రధాన కార్యదర్శి పాలూరి కృష్ణారావు, హంస మహేష్, కనక, గంగరాజు పాల్గొన్నారు.

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ పర్యావరణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ, ప్రిన్సిపల్ కె.వేదవతి పాల్గొని గీతం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఏటా ప్రపంచ వ్యాప్తంగా 400 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వాడుతున్నామని, అందులో 23 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాలు, నదులు, చెరువుల్లోకి చేరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు విషతుల్యంగా మారి పర్యావరణానికి, జంతువులకు హాని చేస్తున్నాయన్నారు.

పద్మనాభం: మండలంలోని రేవిడిలో రక్షిత మంచినీటి పథకం ఆవరణలో శ్రీ శ్రీనివాస యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సంఘ అధ్యక్షుడు పతివాడ ఇంద్రరావు, సభ్యులు తొగరోతు తమ్మునాయుడు, రెల్లి హరీష్, ఒమ్మి పైడినాయుడు పాల్గొన్నారు.

భీమునిపట్నం: పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల అన్నారు. సోమవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మానవ తప్పిదాల వల్ల పర్యావరణం ఎంతగానో దెబ్బతింటోందన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ చెట్లను విచక్షణారహితంగా కొట్టేస్తుండడంతో వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల నుంచి రక్షించుకోవాలంటే మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటడంతోపాటు పర్యావరణ ఆవశ్యకతను తెలిపే చార్ట్‌లు ప్రదర్శించారు. అధ్యాపకులు రాజేశ్వరరావు, డాక్టర్ సహదేవుడు, డాక్టర్ సీహెచ్ జ్యోతి, డాక్టర్ ఎస్.నాయుడు పాల్గొన్నారు. అలాగే జిల్లా విద్యశిక్షణ సంస్థ (డైట్)లో ఛాత్రోపాధ్యాయులు పర్యావణ పరిరక్షణపై చార్టులు ప్రదర్శించారు. అధ్యాపకులు సోమయాజులు, త్రినాథ్ పాల్గొన్నారు.



డైట్‌లో పర్యావరణ ఆవశ్యకత చార్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



స్మృతివనంలో మొక్కలతో కృష్ణారావు, తదితరులు



గీతం ప్రాంగణంలో మొక్క నాటుతున్న ప్రొఫెసర్లు

క్లుప్తంగా

ఉచిత యోగా శిక్షణ తరగతులకు ఆహ్వానం

తగరపువలస: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భీమిలికి చెందిన అంతర్జాతీయ యోగ పరిశోధన, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 21 వరకు చిట్టివలసలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. శ్రీలక్ష్మి శ్రీనివాస కల్యాణ మండపం వద్ద రోజూ ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ఏకాగ్రత, మధుమేహం, కీళ్లవాతం, మోకాళ్ల నొప్పులు, చర్మ రోగాలు, ఆస్తమా, రక్తపోటు, మైగ్రేన్, మానసిక ఒత్తిడి, స్థూలకాయం తదితర సమస్యలకు మందులు లేకుండా నివారణ పద్ధతులు నేర్పిస్తారు. వివరాలకు 08933 – 228222, 94406 43531, 96660 26661లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

నైపుణ్యాలతోనే ఉపాధి మెరుగు

ఆనందపురం : విద్యార్థులు నైపుణ్యాలను మెరుగు పరచుకుంటే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని విద్యా, వ్యక్తిత్వ వికాస నిపుణుడు సంతోష్ కుమార్ సూచించారు. మండలంలోని బంటుబిల్లి వారి కల్లాలులో ఉన్న గాయత్రి డిగ్రీ కళాశాలలో సోమవారం 'జాబ్ ఓరియంటేషన్ ఇన్ కెరీర్ గైడెన్స్' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చుకుంటే భవిష్యత్తు బంగారుబాట అవుతుందని సూచించారు. కళాశాల డైరెక్టర్ బి.రామకృష్ణ మాట్లాడుతూ నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే నిరంతరం శ్రమించాలని సూచించారు. ప్రిన్సిపాల్ అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



కృష్ణాపురంలో అక్రమంగా నిరిస్తున్న గోడను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది సోమవారం తొలగించారు. పాండ్రంగిలో సర్వే నంబర్ 317లోని ప్రభుత్వ స్థలంలో రెండు సెంట్లు విస్తీర్ణంలో అక్రమంగా నిర్మిస్తున్న ఇల్లును తొలగించారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ఇంటిని తొలగించారు. కృష్ణాపురంలో సర్వే నంబర్ ఒకటిలోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న గోడను రెవెన్యూ సిబ్బంది తొలగించారు. ఆర్ఐ కోటేశ్వరరావు, వీఆర్వో రవి ఈ నిర్మాణాలను తొలగించారు.

చెరువు ఆక్రమణదారులపై ఫిర్యాదు

పద్మనాభం: మండలంలోని విలస్కాన్‌పాలెంలో మరికమ్మ చెరువుకు అనుసంధానంగా ఉండే పెద్ద కాలువ, మరికమ్మ చెరువు ఆక్రమించిన రైతులపై బి.రామకృష్ణతోపాటు పలువురు రైతులు సోమవారం స్పందనలో తహసీల్దార్ టి.శ్రీవల్లీకి ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 241లోని పెద్ద చెరువుకు రెండు కిలో మీటర్ల నిడివిలో మండల పరిషత్ నిధులతో నీటి పారుదల శాఖ అధికారులు పూడిక తీత పనులు చేయిస్తున్నారని తెలిపారు. ఈ కాలువను కొంతమేర ఆక్రమించిన రైతులు పూడిక తీత పనులకు ఆటంకం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. సర్వే నంబర్ 244లోని మరికమ్మ చెరువు గర్భాన్ని ఆక్రమించడం వల్ల పంటలు ముంపునకు గురవుతున్నాయని ఆ వినతిపత్రంలో తెలిపారు.

దుకాణాలు తొలగించొద్దని ఆందోళన

తగరపువలస: స్థానిక భీమిలి రోడ్డులో దుకాణాలు తొలగించొద్దని ఇక్కడి వ్యాపారులు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ ప్రాంతంలో అక్రమంగా వెలసిన దుకాణాలను మూసివేయాలని ఇటీవల టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పలువురికి హెచ్చరికలు చేస్తుండటంతో ఈ ఆందోళనకు దిగారు.

స్థానిక వ్యాపారుల మధ్య పోటీ పెరిగి పరస్పరం స్పందనలో ఫిర్యాదులు చేస్తుండటంతో కొద్ది రోజుల కిందట ఒక కూరగాయల దుకాణాన్ని తొలగించారు. మరో దుకాణం మంగళవారం తొలగించాలని హెచ్చరించడంతో ఈ ఆందోళన చేపట్టారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో పూర్వ విద్యార్థులు

కొమ్మాది: శ్రీ పొట్టి శ్రీరాములు పురపాలక ఉన్నత పాఠశాల 2005 – 06 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం భీమిలిని ఓ రిసార్ట్‌లో సోమవారం నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ తమకు విద్యాబుద్ధులు నేర్పిన శ్రీనివాస్, శాస్త్రి, నాగభూషణ్, మహాలక్ష్మి టీచర్లను సత్కరించారు. తమ బ్యాచ్ పేరుతో త్వరలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అదేవిధంగా తమకు చదువు నేర్పి, నీడనిచ్చిన పాఠశాలకు సహాయం చేసేందుకు సిద్ధమయ్యారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎమ్.అప్పలరాజు, ఎ.పద్మావతి, గోవింద్, శ్రీనివాస్, చంద్రశేఖర్, బాలాజీ, అనిల్, అశోక్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివానంద నియామకంపై హర్షం



డాక్టర్ పత్రి శివానంద

తగరపువలస: కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా చిట్టివలసకు చెందిన ప్రముఖ ఎముకల వైద్య నిపుణుడు పత్రి శివానంద నియామకంపై స్థానికులు సోమవారం హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికునిగా పనిచేసిన అప్పలరాజు కుమారుడైన శివానంద చిట్టివలస హైస్కూల్, భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాభ్యాసం చేశారు. తర్వాత వైద్య విద్య పూర్తి చేశాన్నారు. భీమిలి స్వామి యోగానంద భక్తులైన శివానంద కుటుంబ సభ్యులు తరచూ ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. శివానంద సేవలు నిస్వార్థంగా పేద ప్రజలకు అందాలని, ఆయన నియామకం పట్ల రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బి.జాన్ వెస్లీ, కాళ్ల శ్రీనివాస్ కోరారు.

పైడితల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం


పద్మనాభం: మండలంలోని కోరాడలో సోమవారం తొలేళ్లతో పైడితల్లమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమలైన ఘటాలను గ్రామంలో ఊరేగించారు. 1988లో ఈ ఉత్సవాలను నిర్వహించారు. మళ్లీ 35 ఏళ్లకు ఉత్సవాలు నిర్వహించడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రామమంతా పండగ సందడి నెలకొంది. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉయ్యాల కంబాల కార్యక్రమం నిర్వహణకు గ్రామం మధ్యలో తాటి చెక్కలు ప్రతిష్ఠించారు. తాటి చెక్కలకు పసుపు, కుంకుమ రాసి అందంగా అలంకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరాడ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



కోరాడలో ఘటాలు తిప్పుతున్న భక్తులు

సామాజిక సేవకుడు శ్రీనివాసరెడ్డికి డాక్టరేట్

తగరపువలస: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్, ఇంటర్నేషనల్ పీస్ అంబాసిడర్ అవార్డు కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం భీమిలికి చెందిన సామాజిక సేవకుడు వెంపాడ శ్రీనివాసరెడ్డికి గౌరవ డాక్టరేట్ అందించారు. విశిష్ట సేవలు అందించినందుకు వుయ్ కేర్ యూ సొసైటీ ప్రతినిధి అయిన శ్రీనివాసరెడ్డికి వీసీ ఏకే సిన్హా అవార్డు అందించారు. గతంలో రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన శ్రీనివాసరెడ్డి ఇప్పుడు జాతీయ స్థాయిలో గౌరవ డాక్టరేట్ పొందడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని అభినందనలు తెలిపారు.



వీసీ ఏకే సిన్హానుంచి అవార్డు తీసుకుంటున్న శ్రీనివాసరెడ్డి

కొత్తమ్మతల్లికి పసుపు కొమ్ములతో అలంకరణ



తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ సంతపేట, కొత్తపేట తదితర గ్రామాల ఆరాధ్యదేవత కొత్తమ్మతల్లిని సోమవారం సాయంత్రం పసుపు కొమ్ములతో అలంకరించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అలంకరణతో భక్తులకు మంగళవారం దర్శనాలు కల్పించనున్నారు.

డయేరియా నివారణపై ప్రచారం

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది డయేరియా నివారణపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ నెల 17 వరకు పీహెచ్‌సీ పరిధిలోని అన్ని సచివాలయాల్లో అవగాహన కల్పించి ప్రజలను అప్రమత్తం చేయనున్నామని ప్రధాన వైద్యాధికారి ఏబీ మల్లికార్జునరావు తెలిపారు. చేతులు శుభ్రం చేసుకోవడం, పరిసరాల పరిశుభ్రత, ఓఆర్‌ఎస్ ద్రావణం వినియోగంపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు బి.శోభారాణి, సందీప్, ఆరోగ్య విస్తరణ అధికారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' సమస్యలకు సత్వర పరిష్కారం



మధురవాడ జోనల్ కార్యాలయంలో సమస్యలు తెలుసుకుంటున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

మధురవాడ: జీవీఎంసీ జోన్ 2 మధురవాడ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 16 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి ప్రజల నుంచి వినతులు స్వీకిరంచారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి ఆరు, పబ్లిక్ హెల్త్‌కు రెండు, విద్యుత్ విభాగానికి నాలుగు, యూసీడీకి రెండు, ఇంజినీరింగ్ వర్క్స్‌కు నాలుగు ఫిర్యాదులు వచ్చాయి. సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు.

భీమునిపట్నం: ఇక్కడి జోనల్ కార్యాలయంలో సోమవారం జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనలో ఆరు వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి మూడు, ఇంజినీరింగ్, యూడీసీ, రెవెన్యూ విభాగాలకు ఒక్కో వినతి వచ్చింది. వీటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జెడ్సీ వెల్లడించారు.

కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు

తగరపువలస: భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో జీవీఎంసీ రెండో వార్డు జీరుపేటలో సోమవారం కొత్తగా ఆరు విద్యుత్ స్తంభాలు వేశారు. ఇటీవల గాలులకు విద్యుత్ తీగలు తెగి 50 ఇళ్లపై పడడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి సమస్యను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాలతో సిబ్బంది స్తంభాలు వేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పనులను చిల్ల భాస్కరరెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, జీరు అప్పలరెడ్డి, చిల్ల వెంకటేష్ పర్యవేక్షించారు.



జీరుపేటలో స్తంభాలు వేస్తున్న సిబ్బంది

అనుమానాస్పదంగా మణిపూర్ వాసి మృతి

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి ఛాయిస్ బోర్డ్స్ ప్లెవ్వుడ్ ఫ్యాక్టరీలో హెల్పర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మణిపూర్ వాసి జీతు లింగ్దో (37) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కంపెనీ వెనుక తోటలో మృతి చెంది ఉండడాన్ని తోటి కార్మికులు గుర్తించి సూపర్‌వైజర్ రవిప్రతాప్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతునికి మద్యపానంతోపాటు కొన్ని వ్యాధులు ఉన్నట్టు తోటి కార్మికులు తెలియజేశారు. అతని కుటుంబ సభ్యుల వివరాలు ఎవరికీ తెలియవన్నారు. ఎస్ఐ తాతారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హిందీ విద్యార్థులకు పోటీలు

తగరపువలస: భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో 51వ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు విభాగాల్లో 12 మందికి బహుమతులు అందించారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పద్మనాభం: చెట్ల కొమ్మలు తొలగించనున్నందున శిర్లపాలెం 11 కేవీ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు జేఈ డి.జె.రమేష్ కుమార్ తెలిపారు. బోని, అనంతవరం, గంధవరం, పి.గొల్లపాలెం, తిమ్మాపురం, పెంట, పాత కొవ్వాడ, కొత్త కొవ్వాడ, దేవరపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పలు ప్రాంతాల్లో రేపు...

మధురవాడ: మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వుడా కాలనీ 11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్నందున బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ ఎస్‌వీఎస్ రామమూర్తి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎంజీవోస్ కాలనీ, చంద్రంపాలెం, సుద్దగెడ్డ, వాంబేకాలనీ, పోర్టుకాలనీ, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. వినియోగదారులంతా గమనించి సహకరించాలని కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు కొండపేట, ఆ పక్కనే గుడివాడ గ్రామంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధానంద సమితి విజయరాంపురం కమిటీ ప్రతినిధులు సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆచార్య ప్రబోధానందుని బోధనలు, రచనలను వివరించారు. ప్రచారంలో సమితి ప్రతినిధులు కె.త్రినాథరావు, జి.కృష్ణ సూరప్పడు, వి.సురేష్, ఎస్.శ్రీనివాస్, బి.అప్పలనాయుడు, కె.లక్ష్మి, కె.రాజు, కె.సంతోష్‌లక్ష్మి, ఆదమ్మ తదితరులు పాల్గొన్నారు.

భీమిలిలో షూటింగ్ సందడి



షూటింగ్ లొకేషన్‌లో చిత్ర యూనిట్

కొమ్మాది: భీమిలిలోని ఓ గెస్ట్ హౌస్‌లో ఆదివారం సినిమా షూటింగ్ చేశారు. కేవీఆర్ కథ, స్క్రీన్‌ప్లే అందించి దర్శకత్వం వహిస్తున్న హాష్ ఏపీ 31 అనే సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. హీరో చంటి, హీరోయిన్ లహరి షారి (బిగ్‌బాస్ ఫేమ్) నటిస్తున్న ఈ సినిమాను నారాయణ స్వామి నిర్మిస్తున్నారు. సంగీతం ప్రజ్వల్ క్రిష్ అందిస్తున్నారు. ప్రేమ, సస్పెన్స్ థ్రిల్లర్‌గా కొనసాగే ఈ సినిమాలో సీనియర్ నటుడు సాయికుమార్, స్వర్ణలత, టెంపర్ వంశీ నటిస్తున్నారు.